ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నా అక్రమాలు, తప్పులు బయటపడుతూనే ఉన్నాయి. తమకు అన్యాయం జరిగిందని కొందరు టీచర్లు డీఈవో దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదన్న వాదనా విన్పిస్తోంది. స్పౌజ్ బదిలీల్లో భార్యాభర్త ఒకే మండలంలో పోస్టింగ్‌కు దరఖాస్తు చేయాల్సి ఉండగా కొందరు హెచ్ఆర్ఏ ఎక్కువ లభించే స్కూళ్లను ఆప్షన్‌గా చూపుతున్నారు. దీనికి స్పౌజ్ బదిలీ పాయింట్ల వినియోగానికి సంబంధమే లేదు. ఇలాంటి అవకతవకలపై చేసిన ఫిర్యాదులను వెంటనే సరిదిద్దాల్సి ఉన్నా ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడంతో బదిలీ ప్రక్రియలో అర్హులకు అన్యాయం జరుగుతోంది. దీంతో టీచర్లు, సంఘాల నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

- అదనపు పది పాయింట్ల దుర్వినియోగం
- అనుకున్న చోటకు బదిలీకి వినియోగం
- అధిక హెచ్ఆర్ఏ కోసం ఉపాధ్యాయుల అడ్డదారులు
- అర్హతున్న వారికి అన్యాయం
- డీఈవోకు టీఎస్ఎస్టీఏ నేతల ఫిర్యాదు


(ఫైల్)



స్పౌజ్ బదిలీలలు!

స్పౌజ్ ట్రాన్స్‌ఫర్లలో నిబంధనలకు తూట్లు

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూలై 7): ఎన్నో ఏళ్ల తర్వాత చేపడుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ఆశగా ఉన్న టీచర్లు తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు. బదిలీల్లో కొందరు ఉపాధ్యాయులు అధిక హెచ్ఆర్ఏ వచ్చే ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇందుకు స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. న్యాయంగా స్పౌజ్ కేటగిరీలో బదిలీ కావాల్సిన వారికి కోరుకున్న ప్రదేశం లభించడం లేదు. స్పౌజ్ పాయింట్లు తీసుకునే వారు స్పౌజ్ పాయింట్ల రేడియస్‌లోనే బదిలీ స్థానాన్ని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అయితే వారు కోరుకున్న చోట్ల ఖాళీ లేకపోతే పక్క మండలాలు, ఆ తర్వాత మండలాలను ఎంపిక చేసుకోవచ్చు. అలా కాకుండా తమకు ఇష్టం ఉన్న మండలాలకు వెళ్లేలా ఆప్షన్‌లు ఇవ్వడం, అధికారులు పరిశీలించకుండానే ఆర్డర్లు ఇవ్వడంతో స్పౌజ్ పాయింట్ల నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయి. పిల్లలు నిజాయితీగా ఎదగాలని బోధించాల్సిన ఉపాధ్యాయులే అధిక జీతం కోసం ఆరాట పడుతూ నీతిమాలిన పనులు చేస్తున్నారు. భార్యాభర్తలైన ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం మానవతా దృక్పథంతో ట్రాన్స్‌ఫర్, బదిలీల్లో అదనంగా 10పాయింట్లు కేటాయించింది. భార్యాభర్త ఇద్దరు పనిచేసే పాఠశాలలకు దగ్గరగా ఉండాలనే ఈ నిబంధన తెచ్చారు. అందుకు అనుగుణంగా బదిలీల ప్రక్రియలో 10పాయింట్స్ వారికి ప్రత్యేకంగా కేటాయిస్తూ ప్రభుత్వం వెసులుబాటు కలిగించింది. కానీ ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్య పాయింట్లు పొందిన వారి తర్వాత భార్యాభర్తలు ఎనిమిదేళ్లకు ఒకసారి ఎవరో ఒకరు మాత్రమే 10 పాయింట్లు వాడుకోవాలనే నిబంధన ఉంది. కానీ అందుకు విరుద్ధంగా రంగారెడ్డి జిల్లాలో కొనసాగుతోంది. ఉపాధ్యాయుల బదిలీల్లో కేవలం ఈ స్పౌజ్ స్పెషల్ పాయింట్స్ ఉపయోగిస్తూ భార్యాభర్తలు ఇద్దరూ ఒకే మండలానికి రాకుండా అధిక ఇంటి అద్దె(హెచ్ఆర్ఏ) వచ్చే దూర ప్రాంతాల పాఠశాలల ఎంపికనే లక్ష్యంగా వాడుకుంటున్నారు. భార్యాభర్త ఇద్దరూ ఒకే మండలంలో ఉండాలనేది స్పౌజ్ పాయింట్స్ కేటాయింపు లక్ష్యం. ఇష్టానుసారం పాయింట్లు వాడుకోవడంతో మిగితా అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. కొన్నేళ్లుగా మూడు, నాలుగు కేటగిరీల పాఠశాలలకే వీరి సేవలు పరిమితం అవుతున్నాయి.


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ఎస్టీఏ రాష్ట్ర కార్యదర్శి సక్కుబాయి, జిల్లా అధ్యక్షుడు సిద్ధం శ్రీనివాస్

నాన్ స్పౌజ్ టీచర్ అసోసియేషన్ ఏర్పాటు

స్పౌజ్ పాయింట్లలో వినియోగంలో చోటుచేసుకుంటున్న నష్టాన్ని గుర్తించిన ఉపాధ్యాయులు తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం వల్ల నష్టపోతున్న తీరును సింగిల్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పౌజ్ పది పాయింట్లు ఉపయోగించుకొని తమ భర్త లేదా భార్య పనిచేసే మండలానికి వెళ్లకుండా హెచ్ఆర్ఏ ఎక్కువగా వచ్చే ప్రాంతం/పట్టణ/నగర ప్రాంతాలకు సమీప పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. ఈ స్పౌజ్ పాయింట్స్ దుర్వినియోగాన్ని ఎప్పటికప్పుడు మండల, జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

అక్రమాలపై డీఈవోకు ఫిర్యాదులు

కొందరు ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరీలో అక్రమ మార్గాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నట్లు టీఎస్ఎస్టీఏ రాష్ట్ర కార్యదర్శి సక్కుబాయి, జిల్లా అధ్యక్షుడు సిద్ధం శ్రీనివాస్ ఆరోపించారు. అక్రమాలపై వారు కేస్ స్టడీ చేసి ఆ వివరాలతో డీఈవో సుశీందర్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. స్పౌజ్ కేటగిరీలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. స్పౌజ్ కేటగిరీలో దుర్వినియోగానికి పాల్పడిన కొందరి ఉపాధ్యాయుల వివరాలను డీఈవోకు అందజేశారు. వారు సమర్పించిన వివరాల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- జి.భాస్కర్‌రెడ్డి, ఎస్ఏ-గణితం(ఎంప్లాయా ఐడీ నంబర్ 1428990). ఈయన భార్య బాలాపూర్ మండలంలో పనిచేస్తుండగా ఆయన హెచ్ఆర్ఏ అధికంగా వచ్చే మొయినాబాద్ మండలం పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. నిజానికి ఆయన బాలాపూర్ మండలంలోని ఏదో ఒక పాఠశాలనే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ పోస్టు ఖాళీ లేకుంటే బాలాపూర్ సమీప మండలాలనే సెకండ్/థర్డ్ ఆప్షన్లుగా చూపాలి. ఇక్కడ ఇలా జరగలేదు.
- మరో ఉపాధ్యాయురాలు నిషత్ ఫాతిమా ఎస్ఏ-గణితం(ఐడీ నంబరు 1462749). ఆమె భర్త చేవెళ్ల మండలంలో పనిచేస్తుండగా హెచ్ఆర్ఏ అధికంగా లభించే మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ జడ్పీహెచ్ఎస్‌ను ఎంపిక చేసుకున్నారు. స్పౌజ్ పాయింట్లను వాడుకొని ఆమె భర్త పనిచేసే మండలంలోని పాఠశాల ఎంపిక చేసుకోకుండా అధిక హెచ్ఆర్ఏ కోసం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాల ఎంపిక చేసుకున్నారు.
- అలాగే మరొక ప్రధానోపాధ్యాయుడి భార్య స్పౌజ్ పాయింట్లను ఉపయోగించుకుంటూ తన భర్త పనిచేస్తున్న మొయినాబాద్ మండలంలో కాకుండా హెచ్ఆర్ఏ అధికంగా లభించే శేరిలింగంపల్లి మండల పాఠశాలను ఎంపిక చేసుకున్నారు. అలాగే భార్యాభర్తలు ఇద్దరూ తొమ్మిది నెలల కాలంలో స్పౌజ్ పాయింట్లను వినియోగించుకొని అక్రమంగా లబ్ధిపొందారు. భార్య జీహెచ్ఎం బి.రేణుక 2023 సెప్టెంబరులో 10 పాయింట్లు వాడుకొని అప్పటివరకు పనిచేసే మండలం మొయినాబాద్‌లో పోస్టింగ్ పొందారు. ఈ ప్రధానోపాధ్యాయురాలి భర్త అరుణ్‌కుమార్(ఎంప్లాయ్ ఐడీ నంబరు 1436222) ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం మళ్లీ పది పాయింట్లు వాడుకొని మొయినాబాద్ మండలంలోని హెచ్ఆర్ఏ అధికంగా లభించే పాఠశాలను ఎంపిక చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం స్పౌజ్ బదిలీల్లో అదనపు పాయింట్లను 8సంవత్సరాలకు ఒకసారే భార్యాభర్తల్లో ఎవరో ఒకరే వాడుకోవాలి. కానీ ఇక్కడ ఇద్దరూ అదీ తొమ్మిది నెలల కాలంలోనే పది పాయింట్ల చొప్పున వాడుకొని బదిలీలు పొందారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని టీఎస్ఎస్టీఏ నాయకులు ఆరోపిస్తున్నారు.

పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయుల వివరాలను ప్రభుత్వం సేకరించి విచారణ చేపట్టాలి. వివిధ జిల్లాల్లో దుర్వినియోగానికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి. స్పౌజ్ పాయింట్ల వినియోగానికి ఉన్నతాధికారులిచ్చిన మార్గనిర్దేశకాలను కఠినంగా అమలు చేయాలి. రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన అక్రమాలను క్షుణంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. హెచ్ఆర్ఏ కోసం అడ్డదారులు తొక్కుతున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అర్హతల మేరకే బదిలీలు చేయాలి.

- వెకంట్‌రెడ్డి, టీఎస్ఎస్టీఏ ప్రెసిడెంట్


శోభాయమానంగా కొనసాగుతున్న రథయాత్ర

వైభవోపేతంగా జగన్నాథుడి రథయాత్ర

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఒడిశా కళాకారుల ఆటపాటలు

షాద్‌నగర్ అర్బన్, జూలై 7 : షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం జగన్నాథుడి రథయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఆర్టీసీ కాలనీలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి ఈశ్వర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయం వరకు రథయాత్ర నిర్వహించారు. జై జగన్నాథ్ స్వామి సేవా ట్రస్టు, కళింగ కల్చరల్ కమిటీల ఆధ్వర్యంలో జగన్నాథుడి రథంతో పాటు బలరాముడు, సుభద్రరథాలు వరుస క్రమంలో యాత్రలో పాల్గొన్నాయి. రథాలకు మహరాజ్ వినయ్ అగర్వాల్, కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు, ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ చైర్మన్ విష్ణుమూర్తి, జై జగన్నాథ్ స్వామి సేవా ట్రస్టు అధ్యక్షుడు పరశురాందాస్ పూజలు చేసి ప్రారంభించారు. రథయాత్రలో ఒడిశా నుంచి వచ్చిన కళాకారులు ఆడిపాడుతూ భక్తులను ఆనందింపజేశారు. రథయాత్రకు ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉంటున్న ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రథయాత్రకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి సీఐలు విజయ్‌కుమార్, రాంరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మల్లాలం మురళి, వర్ష, జూపల్లి శంకర్, బాలబ్రహ్మచారి, సుధీర్, పిల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బయలుదేరుతున్న జగన్నాథ రథాలు

స్ఫూర్తి కేంద్రంలో జగన్నాథ రథోత్సవం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో గల సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో జగన్నాథ పెరుమాళ్ రథోత్సవాన్ని కనుల పండవగా నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జగన్నాథ పెరుమాళ్ స్వామి రథోత్సవానికి నగరం నుంచి భక్తులు తరలివచ్చారు. జీయర్‌స్వామి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, జగపతిరావు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


జగన్నాథ పెరుమాళ్ రథోత్సవం


బియ్యంతో పట్టుబడిన లారీ

20 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- గోడౌన్‌పై ఎస్వోటీ దాడులు

ఇబ్రహీంపట్నం, జూలై 7 : ఇబ్రహీంపట్నం పరిధి మంగల్‌పల్లి దగ్గర ఓ గోడౌన్‌పై ఆదివారం సాయంత్రం ఎస్వోటీ బృందం దాడులు నిర్వహించి 20టన్నుల రేషన్ బియ్యాన్ని సాధీనం చేసుకుంది. దీనికి సంబంధించి ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నారు. సీఐ సత్యనారాయణ ఇచ్చిన వివరాల ప్రకారం మంగల్‌పల్లి శివారు కోహెడ క్రాస్ వద్ద ఉన్న ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యం నిల్వచేసినట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్వోటీ బృందం దాడులు నిర్వహించింది. గోడౌన్‌లో డంప్ చేసిన 20టన్నుల రేషన్ బియ్యంతోపాటు రవాణాకు సిద్ధంగా ఉన్న ఓ లారీని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడు కులిసోతు నరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో నిందితుడు ప్రేమ్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసులు నమోదు చేసికొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్రిడ్జి వద్ద రోజూ ట్రాఫిక్ జాం

- కొనసాగుతున్న రీటైనింగ్ వాల్ పనులు
- వాహనదారుల ఇబ్బందులు


బారులు తీరిన వాహనాలు

శంకర్‌పల్లి, జులై 7: ఫత్తేపురం బ్రిడ్జి వద్ద రీటైనింగ్ వాల్ పనులు జరుగుతుండటంతో నిత్యం ట్రాఫిక్‌తో జామ్‌తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్న చోట బ్రిడ్జిపై రోడ్డు గుంతలు పడింది. అలాగే పనులు జరుగుతున్న చోట రోడ్డు ఇరుగ్గా మారి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ ప్రదేశంలో తాత్కాలికం గానైనా రోడ్డు వెడల్పు చేస్తే రాకపోకలకు ఇంతగా ఇబ్బంది ఉండేది కాదని వాహనదారులు అంటున్నారు. ఆదివారం బ్రిడ్జి వద్ద వాహనాలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. గత 20 రోజుల నుంచి పనులు జరుగుతుండటంతో ఇక్కడ నిత్యం ప్రజలకు నరకం తప్పడం లేదు. చెవేళ్ల వైపు నుంచి శంకర్‌పల్లికి, శంకర్‌పల్లి వైపు నుంచి చేవెళ్లకు వెళ్లాలంటే గంట సమయం పడుతోంది. కాగా ఆదివారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ చందిప్పలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఫత్తేపురం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్య ఉందని తెలుసుకున్న ఆయన ఇటు వైపు రాకుండా చిలుకూరు మీదుగా చందిప్ప వెళ్లారు. దీన్ని బట్టి ఇక్కడ సమస్య ఎంతగా ఉందో తెలుస్తోంది.


బ్రిడ్జి వద్ద రీటైనింగ్ వాల్ పనులు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు

బొగ్గు బావుల వేలాన్ని నిలిపేయాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు

ఇబ్రహీంపట్నం, జూలై 7: మంచిర్యాల జిల్లా శ్రావణపల్లిలో సింగరేణి బొగ్గు బావుల వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న జి.కిషన్‌రెడ్డి స్వలాభం కోసమే ఈ వేలానికి పూనుకున్నారంటూ ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో రెండ్రోజులపాటు జరిగిన సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ సింగరేణి ప్రజల ఆస్తిఅని, 40వేల మంది పర్మినెంటు కార్మికులు, 20వేల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులున్నారని తెలిపారు. ఈ గనులను ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి కేంద్రంతో చర్చించాలన్నారు. యూపీలోని హత్రాస్ దుర్ఘటనకు సంబంధించి బోలేబాబాను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌రు. బోలేబాబా ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేద భక్తులకు పంచాలన్నారు. కేంద్రం ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ సామాజిక న్యాయాన్ని మంటగలుపుతోందని, ఇప్పటికే ఆరు లక్షల కోట్ల విలువైన స్థలను ప్రైవేట్‌కు అప్పగించారని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రైవేట్‌లోనూ విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామెల్ మాట్లాడుతూ అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంతో ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, రైతులకు తగు న్యాయం చేయాలన్నారు. ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.జంగయ్య, నాయకులు పి.యాదయ్య, కె.జగన్, బుగ్గరాములు, ఎం.వెంకటేష్, టి.నర్సింహ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపైనే ఆశలు

- అరకొరగా వర్షాలు.. పత్తి విత్తిన రైతులు
- ఎదుగుతున్న మొలకలు.. సరిపడా అందని నీరు
- వారానికో వాన పడితేనే పంట చేతికి
- సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదు


పత్తి చేనులో కలుపు తీస్తున్న మహిళలు

యాచారం, జూలై 7 : అరకొరగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఇతర పంటల కంటే వర్షాభావాన్ని తట్టుకొని పండే పత్తి సాగువైపే మొగ్గు చూపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి రెండింతలు అధికంగా పత్తి సాగైంది. ఓ నాలుగెకరాలున్న రైతు మూడున్నర ఎకరాల్లో పత్తి, అర ఎకరంలో జొన్న, పప్పు దినుసులు, కూరగాయల సాగు చేశారు. నెల రోజులుగా అడపాదడప కురుస్తున్న వర్షాలతో పత్తి మొక్కలు నాలుగైదు ఆకులకు వచ్చాయి. జూన్ మొదట్లో విత్తన వారు కలుపు తీస్తున్నారు. విత్తిన కొన్ని రోజుల వరకూ వానపడక చాలాచోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో రైతులు రెండోసారి విత్తనాలు నాటారు. ఇప్పటి వరకు ఆశించిన మేర వర్షాలు కురవక మొక్కల ఎదుగుదల లోపించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాచారం మండలంలోని 2022లో 1,400 ఎకరాలు, 2023లో 1,100ఎకరాల్లో పత్తివేయగా ఈ ఏడాది ఇప్పటికే 3,500ఎకరాల్లో సాగైందని మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. ఈ విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. పత్తి పంట చేతికందాలంటే వానాకాలం పూర్తయ్యే వరకు వారంలో కనీసం ఒక్క వర్షం అయినా పడాలని చౌదర్‌పల్లి రైతు యాదయ్య తెలిపారు. ఈ సారి తక్కువ వర్షపాతం నమోదైనా వారానికో తడి పెట్టినట్టు వానపడినా పత్తి పండుతుందనే ఆశతో పత్తి పెట్టామని.. అయితే వర్షాలు తక్కువే పడుతున్నాయని ధర్మన్నగూడ రైతు రఘుపతి అన్నారు. ఈ జూన్‌లో 86.2 మిల్లీ మీటర్లు, జూలైలో ఇప్పటి వరకు 13మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఇది సాధారణం కంటే తక్కువే. ఈ ఏడాది ఒక్క పెద్ద వాన కూడా కురవలేదు. భూమిలో వేడి పోనేలేదు. దీంతో పంటలు ఆశించినంత మేర సాగుకాలేదు. కాస్తోకూస్తో పత్తి మాత్రం సాగైంది. ఆగస్టులో భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలకు నీరొస్తుందని, భూమిలో తేమ శాతం పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. వర్షాలు పడి భూగర్భ జలమట్టం పెరిగితే బోర్లు ఉన్న రైతులు మిగతా పంటలు వేయాలని చూస్తున్నారు.


ధర్మన్నగూడలో సాగవుతున్న పత్తి

ఆరోగ్యశ్రీ, పింఛన్లు 'దండోరా' పోరాట ఫలితమే

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ

తాండూరు రూరల్, జూలై 7: దండోరా పోరాటంతోనే ఆరోగ్యశ్రీ, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్లు సాకారమయ్యాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాండూరు పట్టణంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాదిగ, ఉపాధ్యక్షుడు పి.నర్సింహులు మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 20మందితో ప్రారంభించిన మాదిగ దండోరా ఉద్యమం నేడు దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. దివ్యాంగుల పింఛన్ల పెంపునకు పోరాటం చేయడం వల్లే వారి పెన్షన్లు పెరిగాయని గుర్తు చేశారు. జూలై 7 నాటికి దండోరా ఉద్యమం 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నర్సింహా మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ మాదిగ, ఉపాధ్యక్షులు బి.కృష్ణ, కార్యదర్శి డప్పు మహేందర్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివాజీ, కో-కన్వీనర్ అజయ్, జాని, తాండూరు మండల అధ్యక్షుడు జగదీష్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, అధికార ప్రతినిధి పరశురాం, బలరాం, రాములు, చంద్రప్ప, వెంకటేష్, కృష్ణ, డప్పు నర్సింహా, ఉమాశంకర్ పాల్గొన్నారు.



తాండూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన కేక్ కట్ చేస్తున్న నాయకులు

పంటలకు యూరియా

నవాబుపేట, జూలై 7: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం టమాట తదితర పంటలకు యూరియా, డీఏపీ రసాయనాలు చల్లుకున్నారు. పంట పొలాలు తడిగా ఉండటంతో ఎరువులు, రసాయనాలతో పంట ఏపుగా పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.



పత్తిపంటకు మసాల వేస్తున్న రైతులు

30మంది బాలలకు విముక్తి

వికారాబాద్, జూలై 7: ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 30మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తప్పిపోయిన పిల్లలతో పాటుగా బాల కార్మికులుగా పని చేస్తున్న చిన్నారులు, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి వారిని రక్షించి పునరావాసం కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్-10 ముఖ్య లక్ష్యమని తెలిపారు. జిల్లా లో ఈ కార్యక్రమం జూలై 1న ప్రారంభమై 31వరకు కొనసాగుతుందన్నారు. సబ్ డివిజన్ వారీగా లేబర్, ఉమెన్, చైల్డ్‌వెల్ఫేర్, ఎన్‌జీవోలు, పోలీస్ అధికారులతో కలిసి మూడు టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంతోషంగా చదువుకుంటూ ఆట పాటలతో సాగాల్సిన చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తున్న బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నాశనం చేయడానికి జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఒక్కరు కలిసి పని చేయాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనబడితే డైల్ 100కి గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670056 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.



ఎస్పీ నారాయణరెడ్డి

సమస్య తీరేనా?

● రోడ్లపై తోపుడు బండ్లు
● స్తంభిస్తున్న ట్రాఫిక్
● పట్టించుకోని పాలకులు, అధికారులు



వికారాబాద్‌లో ట్రాఫిక్

వికారాబాద్, జూలై 7: వికారాబాద్ పట్టణంలో జనాభా రోజురోజుకు పెరుగుతుండగా అదేస్థాయిలో ట్రాఫిక్ కూడా పెరిగిపోతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్లు పూర్తిగా రద్దీతో కన్పిస్తున్నాయి. అయితే వికారాబాద్ పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి బీజేఆర్, మహాశక్తి, ఎంఆర్‌పీ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా పండ్ల వ్యాపారులు వ్యాపారం చేస్తున్నారు. వారే నగంరోడ్లను అక్రమిస్తుండడంతో వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో పండ్ల వ్యాపారులకు మార్కెట్ స్థలం కేటాయించి అందులో పండ్లు అమ్ముకోవాలని ఆలోచనలు చేసినా ఆ ఆలోచనలు మాత్రం ఎవరూ ఆచరణలో పెట్టలేదు. సమస్య వచ్చినప్పుడే చర్చించుకోవడం తప్పా ఆ తర్వాత రాజకీయ నాయకుల ఒత్తిళ్ల వల్ల ఎక్కడి సమస్య అక్కడే ఉండిపోతోంది. ఓట్లకోసం రాజకీయ నాయకుడు వారిని అక్కడి వారి బండ్లను తొలగించక పోవడంతో పట్టణం నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతుంది. పోలీసు శాఖ, మునిసిపల్ శాఖ సమన్వయంతో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న తోపుడు బండ్లను తొలగిస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయని అదే సమయంలో వ్యాపారులకు సైతంనష్టం జరుగకుండా వారికి కూడా మంచి స్థలం కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షుల ఆర్కిటెక్చర్

కొడంగల్ రూరల్, జూలై 7: అందమైన గూడు నిర్మించడంలో గిజిగాడుకు ఎవరూ సాటిరారు. మనుషులు ఇంజనీర్ ప్లానింగ్‌తో నిర్మించుకున్నట్లుగానే ఈ పిచ్చుక గూడు అమరిక, నేర్పరితనం, కళాత్మక నైపుణ్యం అబ్బురపరుస్తుంది. సన్నటి గడ్డి పరకలతో అందంగా గూళ్లను నిర్మించడం వీటి ప్రత్యేకత. గ్రామాల్లోని బావుల దగ్గర ఉన్న చెట్లకు పిచ్చుక గూళ్లు ఏర్పాటు చేసుకోవడం చూపరులను ఆకట్టుకుంటుంది. కొడంగల్ మండలంలోని నాగారం గ్రామ సమీపంలోని తుమ్మచెట్టు కొమ్మలకు పిచ్చుక గూళ్లు వేలాడుతూ ఆ మార్గం మీదుగా వెళ్లే చూపరులను కనువిందు చేస్తున్నాయి. సుమారు 20 నుంచి 30గూళ్లు ఒకే చెట్టుకు ఉండటంతో ఎంతగానో ఆకర్శిస్తోంది. ఈ అరుదైన దృశ్యాన్ని ఆదివారం 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.



నాగారం శివారులో చెట్టుకు పిచ్చుక గూళ్లు

బాధిత కుటుంబానికి స్పీకర్ పరామర్శ

చేవెళ్ల, జూలై 7 : చేవెళ్లకు చెందిన సీనియర్ జర్నలిస్టు బి.వెంకటేశ్ సతీమణి సంగీత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం ఉదయం చేవెళ్ల మండల కేంద్రంలోని న్యూ జర్నలిస్టు కాలనీలో ఉన్న వెంకటేశ్ నివాసానికి చేరుకొని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి, పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు నాయకులు యాదయ్య, గిరిష్‌కుమార్, సలీం తదితరులతోపాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు నాయకుల సన్మానం

చేవెళ్ల, జూలై 7 : ఇటీవల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రం మీదుగా షాద్‌నగర్ వెళ్తున్న ఎమ్మెల్సీ మల్లన్న కొద్ది సేపు చేవెళ్లలో ఆగడంతో చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామం మాజీ సర్పంచ్ జి.రాంచంద్రయ్యగౌడ్, ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్ కె.నరేందర్‌యాదవ్‌లు ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

తెలంగాణలో టీడీపీకి పునర్వైభవం

● టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదిలాల్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యాదిలాల్, తదితరులు

ఆమనగల్లు, జూలై 7: తెలంగాణలో టీడీపీకి పునర్ వైభవం వస్తుందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అండేకార్ యాదిలాల్, టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండె సత్యనారాయణ, పార్లమెంట్ కోశాధికారి అర్థం నర్సింహులు అన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ ప్రజల హృదయాల్లో టీడీపీ ఉంటుందని పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం.. తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వచ్చిన సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గం నుంచి యాదిలాల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. ఆమనగల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు, టీడీపీకి అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాలలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు తరలి వెళ్లారు. చంద్రబాబు నాయుడును సత్కరించి అభినందించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. యాదిలాల్, సత్యం, నర్సింహ్మలు మాట్లాడుతూ టీడీపీ సంక్షోభాలను ఎదుర్కొని ఏపీలో అధికారం చేపట్టడం కార్యకర్తల కృషి ఫలితమేనని అన్నారు. తెలంగాణలో కూడా టీడీపీకి గత వైభవం మొదలైందని, పార్టీ కోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. నాయకులు ఎంగిలి శ్రీధర్, కండె భాస్కర్, వజ్రలింగం, ఎన్టీ పంచాక్షరి, కోట రాములు, అనిల్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫాతిమాపూర్ చర్చి కమిటీ

ఫాతిమాపూర్ అభివృద్ధికి కృషి

» ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి

కొత్తూర్, జూలై 7: పవిత్ర ప్రార్థన మందిరంగా వెలుగొందుతున్న ఫాతిమాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని ఫాతి మాపూర్‌కు చెందిన ఫాతిమా మాత చర్చి కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఫాతిమాపూర్‌లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాలను తన నిధులతో నిర్మి స్తామని హామీ ఇచ్చారు. అలాగే సమస్యలు తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారించేందుకు కృషి చేస్తానన్నారు. తనను సన్మానించిన చర్చి కమిటీ, గ్రామస్తులకు నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ ఎంపీ టీసీ జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్య నారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, కళ్లెం నర్సింహారెడ్డి, మెండె కృష్ణ, చర్చి ఫాదర్ సైమన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు అల్విన్‌రెడ్డి, చర్చి కమిటీ సభ్యులు దిలీప్‌రెడ్డి, లుర్దారెడ్డి, మర్రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాగ రెడ్డి, బాలశౌరిరెడ్డి, సామ్సన్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, కె.లుర్దారెడ్డి, జోసప్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంతారంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

చేవెళ్ల, జూలై 7 : గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను విని యోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల సీనియర్ నాయ కులు కావలి వెంకటేశ్‌బాబు, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్య క్షుడు ఆర్.మధుసూదన్‌గుప్తా అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరి ధిలోని అంతారం గ్రామంలో ఓం సాయిరాం గ్రామ సేవా సమితి-వన స్థలిపురం ఆధ్వర్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేయడంతో పాటు మందులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంతారం గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ప్రజలందరు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి శిబిరాలను రానున్న రోజుల్లో మరిన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో నాయకులు లక్ష్మీనారాయణ, సంజీవ్, కుమార్, ఆంజనేయులు, రవికిశోర్, దయాకర్, నాగేశ్, తరుణ్‌కమార్, వైద్యసిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బుర్జుగడ్డ తండాలో వెటర్నరీ ఆస్పత్రి ప్రారంభం

» దక్షిణాదిలో అతిపెద్ద పశువుల ఆస్పత్రి
» 6వేల వరకు పశువులకు వైద్యమందించే ఏర్పాట్లు
» నా కల నేరవేరింది : ధరమ్ రాంఖా



బుర్జుగడ్డ తండాలతో వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దాతలు



శంషాబాద్ రూరల్, జూలై 7: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దషాపూర్ తండా అను బంధ బుర్జుగడ్డ తండాలో దక్షిణ భారతదేశం లోనే అతి పెద్ద 'మా సరస్వతి' వెటర్నరీ ఆస్పత్రిని ఆదివారం దాతలు పిల్లలు రుహి, మోహర్ ప్రారంభించారు. సత్యం శివం సుందరం గోశాలల చైర్మన్ ధరమ్‌రాజ్ రాంఖా నేతృత్వంలో దాతల సహాయంతో రూ.3కోట్లతో ఈ ఆస్పత్రిని నిర్మిం చారు. 51,000చదరపు అడుగుల విస్తీర్ణంలో అంబులెన్స్, ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, డయాగ్నొస్టిక్ వంటి సదుపాయలు కల్పించారు. ఐదుగురు వెటర్నరీ డాక్టర్లు, ఐదు గురు అసిస్టెంట్లు, ఐదుగురు పారామెడికల్ సిబ్బందితో పాటు ప్రత్యేక వైద్యులు ఇక్కడ అందు బాటులో ఉంటారు. నర్సులు కూడా ఉంటారని నిర్వాహకులు తెలిపారు. రోజుకు కనీసం 10పశు వులకు సర్జరీలు, వంద జంతువులకు చికిత్సలం దిచే సామర్థ్యం ఈ ఆస్పత్రికి ఉందని డాక్టర్ నిషిత తెలిపారు. సంవత్సరానికి 3వేల శస్త్రచికి త్సలు చేయాలని, ఓపీడీ సంవత్సరానికి 36వేల జంతువులకు చికిత్స చేయా లనే లక్ష్యంతో ఇంత పెద్ద పశువుల ఆస్పత్రిని నెల కొల్పామన్నారు. ఈ ఆస్పత్రిలో సత్యం శివం, సుదరం గోశాల పశువులకే కాక చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని పశువులకు, మేకలకు, గొర్రెలకు, కుక్కలకు, ఇతర పశువులకు చికిత్సలు అందిస్తా మన్నారు. నగరంలోని గగన్‌పహాడ్‌లో గల సత్యం శివం సుందరం గోశాలలో ఉన్న 3,200పశువులు, బుర్జుగడ్డ తండాలో గోశాలలో ఉన్న 2,800 పశువులకు నిత్యం చికిత్సలు అందిస్తామన్నారు. సత్యం, శివం, సుందరం గోశాల చైర్మన్ ధరమ్ రాజ్ రాంఖ మాట్లాడుతూ.. గత 30సంవ త్సరాలుగా వేలాది పశువులను పోషి స్తున్నా, పశువుల ఆస్పత్రి కట్టాలనే తన కల నెర వేరిందని చెప్పారు. దీని నిర్వహణకు రోజుకు రూ.3లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. మను షలు జంతువులను, ప్రకృతిని ప్రేమించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి పశువుల ఆస్పత్రి నిర్మించాలని తన కోరిక అని, అది ఇప్పుడు దాతల సహాయంతో నెరవేరిందన్నారు. ఆస్పత్రి నిర్మాణానికి విరాళరాలు అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

నేడు మండల ప్రజాపరిషత్తు

పాలక వర్గానికి వీడ్కోలు

» హాజరుకానున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జూలై 7: మండల ప్రజాపరిషత్తు పాలక వర్గ వీడ్కోలు సమావేశం నేడు(సోమవారం) నిర్వహి స్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.హన్మంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ధారూరు లోని శుభం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11గంటలకు నిర్వహించే వీడ్కోలు సమావేశానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొ నాలని ఆయన కోరారు.



నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

యువత అంబేడ్కర్‌ను

స్ఫూర్తిగా తీసుకోవాలి

ఘట్‌కేసర్, జూలై7: నేటి యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని ఘట్‌కేసర్ కురుమ సంఘం అధ్యక్షుడు దయ్యాల గట్టయ్య అన్నారు. ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్ర మంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. యువత మహనీయు లను ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో పయ నించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దయ్యాల రమేష్, చిందం శ్రీశైలం, దాసు, నర్సింగ్‌రావు, రాజేష్, మహేందర్, సత్యం, పరమేష్, జగదీష్, సచిన్ పాల్గొన్నారు.

ముంపుపై ముందస్తు ప్రణాళిక ఏది?

» తీరని వరద కష్టాలు
» ఆదర్శ కాలనీ వాసులకు అవస్థలు
» స్పందించని రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు

తాండూరు, జూలై 7: వరద కష్టాలకు చెక్ పడడం లేదు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలకు ఉపక్రమించారు. పట్టణ శివారు నలుమూల విస్తరించిన చిలుక వాగు ప్రక్షాళనతోనే వరద కష్టాలు తీరుతాయని భావించి రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖ లను వెంటనే రంగంలో దించారు. అవసరమైన నిధులు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. లోతట్టు ప్రాంతాల ముంపును నివారించేందుకు ప్రత్యామ్నయ చర్యలు చేపట్టారు. అయినా శని వారం రాత్రి కురిసిన వర్షానికి తాండూరులోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరి జనం ఇబ్బందులు పడ్డారు. వానొస్తే తమకు వరద కష్టాలు తప్పడంలేదని కాలనీవా సులు వాపోతున్నారు. ప్రస్తుతం పలు కాలనీల్లో అస్తవ్యస్తమైన డ్రైనేజీ, ఓపెన్ ప్లాట్లు, నాలాపై ఉన్న కబ్జాలను తొలగిస్తే 50శాతం మేర పట్ట ణంలో వరద కష్టాలు తొలగుతాయని స్థానికులు అంటున్నారు.



ఆదర్శనగర్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు

ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలు

ఆదర్శనగర్ కాలనీ, గ్రీన్‌సిటీ, హైరాబాద్ రోడ్డు మార్గం, భవానీ నగర్ కాలనీ, ముత్యాల గల్లీ, చెంగోల్ బస్తీ, సెయింట్ మార్క్స్ హైస్కూల్ ప్రాంతం, శాంతినగర్ పార్కు ఏరియా, మార్కం డేయ కాలనీ ప్రాంతాలు ప్రధానంగా ప్రతీ యేడాది వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో డ్రైనేజీలు వర్షం కురిసిన సమయంలో మురికినీరు రోడ్లపైకి వస్తోంది. డ్రైనేజీలు చిన్నవిగా ఉండడం, ఎగుడు, దిగుడు రోడ్లు ఉండడం దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే కొంత మేరకు ఉపశమనం కలుగుతుందనిస్థానికులు అంటున్నారు.

నిలిచిన చిలుక వాగు కాల్వ పనులు

తాండూరులో వరద కష్టాలకు ప్రధాన కార ణంగా భావిస్తున్న చిలుక వాగులో కాల్వలు తీయా లని నిర్ణయించారు. రెండు రోజుల పాటు జేసీబీ, ఇటాచీతో పనులు కొనసాగించారు. శనివారం పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో పట్టాల్యాండ్, ఇళ్ల నిర్మాణం జరుగడం, కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మ ర్లు ఉండడమే పనుల నిలుపుదలకు కార ణంగా తెలుస్తోంది. కానీ రెవెన్యూ అధికా రుల వద్ద పూర్తిస్థాయి సర్వే చేసేందుకు అవసరమైన మ్యాప్‌లు అందుబాటులో లేనట్లు సమాచారం. అడుగడుగునా అడ్డం కులు ఏర్పడుతున్నాయి. పట్టా భూములుం డడం ఇళ్ల నిర్మాణాలు పూర్తఅవ్వడంతో రెవెన్యూ అధికారులు ఇక్కడ సర్వే చేసేం దుకు జంకుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం మిగి లిన ప్రాంతంలో పనులు కొనసాగుతాయా? ఇంత టితో నిలిపివేస్తారా? అని ప్రజలు చర్చించుకుంటు న్నారు. ఇక్కడ సర్వే జరగాలంటే ఐదుశాఖల అధి కారులు ఉండాలి. ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, మున్సి పల్, రెవెన్యూ శాఖలతో పాటు పోలీస్ శాఖ సహ కారం తీసుకోవాల్సి ఉంటుంది.



శనివారం జలమయమై కట్టమైసమ్మ పక్కనున్న రోడ్డు



జలమయమై రోడ్డు

పేరుకుపోతున్న విద్యుత్ సమస్యలు

» అధికారులకు విన్నవించినా స్పందన కరువు!



పెద్దఎల్కిచర్ల గ్రామ శివారులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

చౌదరిగూడ, జూలై 7: ఆ గ్రామాల్లో చెట్టు కొమ్మ కదిలినా, చినుకు పడినా విద్యుత్ సమస్య తలెత్తడం మామూలైంది. వారంలో రెండు, మూడు రోజులకొకసారి విద్యుత్ సమస్య ఏర్పడుతోంది. అధికారులు మాత్రం స్పందించడం లేదు. కొన్నేళ్లుగా సమస్య ఉందని అధికారులకు విన్నవించినా పట్ట నట్లు వ్యవహరించడం ఆ శాఖ అధికారులకు పరిపాటిగా మారింది. దాంతో మండల పరిధిలోని మూడు గ్రామాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధి లోని గాలిగూడ, పెద్ద ఎల్కిచర్ల, ధర్మతండాలో తీవ్రమైన విద్యుత్ సమస్య ఉంది. చినుకు పడినా, చెట్టు కదిలిన కరెంటు సప్లై ఆగిపోతోంది.

మూడు గ్రామాల ప్రజలకు నిద్రలేని రాత్రులు

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్‌స్టేషన్ పరిధిలో గల పెద్దఎల్కిచర్లలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. చినుకు పడినా, చెట్టు కొమ్మ కదిలినా.. గంటల కొద్ది విద్యుత్ సరాఫరా నిలిచిపోతోంది. ఇటీవల కాలంలో వారంలో రెండు సార్లు గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపో యింది. వర్షం పడిన సమయంలో లైన్ ట్రిప్ అవుతోందని, విద్యుత్ మీటర్లలో కరెంట్ సరఫరా అయినట్లు చూపిస్తున్నా.. ఇంట్లో బల్బు వెలగదు, ఫ్యాన్ తిర గదు. ఈ సమస్య స్థానిక విద్యుత్ అధికారుల నుంచి తాలుకా స్థాయి అధికా రుల వరకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ పరి స్థితి పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో కొన్ని వార్డులతో పాటు గాలిగూడ, ధర్మతండా పంచాయతీలో నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవా ల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా లైన్ ట్రిప్ అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మండల పరిధిలోని వీరన్నపేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామ పరిధిలో విద్యుత్ సమస్య తలెత్తిన సమ యంలో స్థానికులతో లైన్‌మన్.. ప్రపంచమంతా ట్రిప్ అవుతుంది.. మీకే అవుతుందా.. అంటూ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. కాగా, ఆయా గ్రామాల పరిధిలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు ఒరిగి ఉన్నాయి. మరి కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు కరెంటు తీగలకు తాకుతున్నాయి. అయినా, అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా మరికొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకకనీసం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుర్రంపల్లిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఎమ్మెల్యే హెచ్చరించినా పట్టింపేదీ

మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామ విద్యుత్ సమస్యపై ఓ సంద ర్భంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమస్యను పరిష్కరించాలని సూచించినా అధికారులు మాత్రం అలసత్వాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నారు. విద్యుత్ సమస్యపై అధికారులకు విన్నవించి దాదాపు నాలుగు నెలలు గడి చినా స్పందించడం లేదు. దాంతో గ్రామస్తులు మరోమారు ఫిర్యాదు చేసేం దుకు సిద్ధమవుతున్నారు.

బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శుల నియామకం



శంషాబాద్ రూరల్/చేవెళ్ల: కుమారి,కావ్యకృష్ణగౌడ్‌లకు నియామక పత్రాలు అందజేస్తున్న నర్సింహారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 7 : మున్సిపల్ పరిధి లోని తొండుపల్లికి చెందిన కోడూరి కుమారిని బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియ మిస్తూ పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆది వారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. కుమారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని, మహిళా సమస్యలపై పోరాడుతానని చెప్పారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తొండుపల్లిలో మహిళ సమస్యలపై పోరాటం చేశానని గుర్తుచే శారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా కావ్య కృష్ణగౌడ్

చేవెళ్ల : మండల పరిధిలోని కందవాడ మాజీ ఉప సర్పంచ్ గౌండ్ల కావ్యకృష్ణగౌడ్‌కు మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. మండల పరి ధిలోని దేవునిఎర్రవల్లికి చెందిన పద్మ మాణిక్యంను కార్యవర్గ సభ్యురాలుగా నియమించారు. ఈ మేరకు బొక్క నర్సింహారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షు రాలు శిల్పారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు బి.రమాదేవి తది తరుల చేతులు మీదుగా నియామక పత్రాలు అందజే శారు. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేసేం దుకు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు అంజన్ కుమార్‌గౌడ్, చేవెళ్ల మండలాధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణ గౌడ్, ఇందిరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు మోక్షమెప్పుడో?

» స్థలాన్ని కబ్జా చేసేందుకు రియల్టర్ల యత్నం » ట్రాఫిక్ సమస్యలతో వాహనదారుల ఇబ్బందులు



కీసరలో దాయర రోడ్డులోని ప్రభుత్వ భూమిలో సంత

కీసర, జూలై 7: మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించి సంవ త్సరాలు గడుస్తున్నా ఇంత వరకు నిర్మాణాన్ని చేపట్టలేదు. దీంతో కొంత మంది రియల్టర్లు కొంత స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్ని స్తున్నారు. వారాంతపు సంత రోడ్ల పైనే నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరా లిలా ఉన్నాయి. కీసరలో దాయర వెళ్లే ప్రధాన రహదారిపై ప్రతీ సోమ వారం వారాంతపు సంత నిర్వహి స్తారు. కీసర గ్రామస్థులతో పాటు భోగారం, గోధు మకుంట, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, యాద్గార్‌పల్లి, చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు క్రషర్ మిషన్, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల వద్ద పనిచేసే ఎంతో మంది వలస కార్మికులు వారాం తపు సంతకు వస్తుంటారు. కూరగాయలు, ఇతర సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు. ప్రతీ సోమ వారం సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే సంతకు వందల మంది ప్రజలు వస్తుంటారు. దీంతో దాయర రోడ్డు మొత్తం కిక్కిరిసిపోతుంది. సంతలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా కూరగా యాలు పోసి అమ్ముతుండటంతో, రోడ్డు మొత్తం జనసంద్రంతో నిండిపోతుంది. కీసర ప్రధానచౌ రస్తా వరకు జనం తాకిడి ఉండటంతో చౌరస్తాలో పెద్ద మొత్తంలో ట్రాఫిక్‌జామ్ అవుతుంది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

మార్కెట్‌యార్డు స్థలం కబ్జాకు యత్నం

మేడ్చల్ మాజీ కలెక్టర్ ఎంవీరెడ్డి సమస్యను గుర్తించి కీసరలో మార్కెట్ యార్డు నిర్మించాలని ఈద్గా వద్ద ఉన్న సర్వేనంబర్ 361లో కొంత స్థలాన్ని కేటాయించారు. నిర్మాణానికి మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, గత పాలకులు క్షేత్రస్థా యిలో స్థలపరిశీలన చేశారు. కానీ ఇంతవరకు మార్కెట్ యార్డు నిర్మించకుండా పాలకులు కాల యాపన చేశారు. దీంతో సంత సమస్య తీరకపోగా, కబ్జాదారులతో కొత్త సమస్య వచ్చి పడింది. స్థలం మాదంటూ కొంతమంది రియ ల్టర్లు ఇంటి నిర్మాణం చేపట్టారు. గ్రామస్థుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అధి కారులు, పాలకుల నిర్లక్ష్యం వల్లే మార్కెట్ యార్డు నిర్మాణానికి పునాది రాళ్లు పడలేదని, సమస్యను గుర్తించి నిర్మాణం చేపట్టి ఉంటే, ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మా ణాలు జరిగి ఉండేవి కావని గ్రామ స్థులు వాపోతున్నారు.

చిల్లర దొంగలకు ఆవాసంగా సంత

ఇదిలా ఉండగా, వారాంతపు సంతలో జనం కిక్కిరిసి ఉండ టంతో చిల్లర దొంగలకు సంత అవాసంగా మారింది. సంతకు వచ్చే ఎంతోమంది వద్ద చిల్లర దొంగలు సెలఫోన్లు, పర్సులు చోరీ చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చెద్దామంటే పోలీసుల సెల్‌ఫోన్లే చోరీకి గురవుతుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలి యని పరిస్థితి.

గత ప్రభుత్వంలో పాలకులు, అధికారులు కీసర మార్కెట్ యార్డు నిర్మాణానికి చొరవ చూపలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వ పాల నలోనైనా కీసరలో మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టి వారాంతపు సంతకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రభుత్వ భూమి అక్రమణకు గురి కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కీసర గ్రామ ప్రజలు కోరుతున్నారు.



శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి శ్రీశైలం వెళ్లే రోడ్డు

శివాలయం రోడ్డు ఇలా.. ఎవరూ పట్టించుకోకపోతే ఎలా?

కడ్తాల్, జూలై 7 : మండల పరిధిలోని మైసిగండి శివాలయానికి వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా పాడై రాకపోక లకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. కాగా, రోడ్డు సరిగ్గా లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. శ్రీశైలం-హైద రాబాద్ జాతీయ రహదారి నుంచి శివాలయం వరకు ఉన్న రోడ్డు దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకనుగు ణంగా నిర్మించారు. కాగా, ఏళ్ల కాలంగా నిర్వహణ లేక బీటీ కొట్టుకుపోయి, కంకర తేలి రోడ్డు అధ్వానంగా మారింది. దాంతో తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కిలో మీటర్ మేర ఉన్న ఈ రోడ్డును ఆధునీకరించి డబుల్ రోడ్డుగా విస్తరించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంలో ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్వాహ కులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శివా లయం రోడ్డును ఆధునికరించడంతో పాటు మైసమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డును కూడా పూర్తిస్థాయిలో సీసీ వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

● జెండాల ఆవిష్కరణ ● పాల్గొన్న నాయకులు



షాద్‌నగర్ అర్బన్ : ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, నినాదాలు చేస్తున్న నాయకులు



ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న పాపిశెట్టి రాము, మల్లేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 7:ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం స్థాపించిన ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆదివారం షాద్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ మాదిగ మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనసే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించి, 30 సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారని గుర్తుచేశారు. ఎన్ని అవరోధాలు వచ్చినా ఉద్యమాన్ని ఆపకుండా ముందుకు నడిపిస్తున్నారని, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సైతం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణనే లక్ష్యంగా ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెంటనోళ్ల రవికుమార్ మాదిగ, ఆనగాళ్ల ఆనంద్‌మాదిగ, ఎన్.మహేందర్‌మాదిగ, నాగభూషణ్ మాదిగ, సురేష్ మాదిగ, జంగయ్యమాదిగ, లక్ష్మయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మాదిగల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన మాదిగల దండోర ఉద్యమానికి 30 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శీను, సీనియర్ నాయకులు దశరథ్, గ్యార సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కందుకూరు : ఎస్సీ వర్గీకరరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద నర్సింహ తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆ సంఘం జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.నర్సింహ, కె.రాములు, ఆలేటి కృష్ణ, జంగయ్య, యాదయ్య, రాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మల్లేపోగు మల్లేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ సంఘ సేవకుడు పాపిశెట్టి రాము, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్‌లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మల్లేశ్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాపిశెట్టి రాము కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు అనుకూలంగా నినాదాలు చేశారు. వర్గీకరణ సాధిచేందుకు వరకు మాదిగల పోరాటం కొనసాగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పులికంటి మైసయ్య, విఠాయిపల్లి రమేశ్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తలకొండపల్లి : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కిరణ్ పూలే మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందని కిరణ్ మాదిగ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా నాయకుడు పోతుగంటి మహేశ్, స్వేరోస్ కమాండర్ సురేశ్, మండల నాయకులు ఆశప్ప, ప్రహ్లాద్, మహేశ్, నర్సింహ్మ, సురేశ్, శ్రీను, ఉపేందర్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : తొండుపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

కడ్తాల్ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగళపల్లి నర్సింహ, అబ్బు రమేశ్, మంకి శ్రీను, కంబాల శ్రీకాంత్, శ్రీశైలం, శ్రీను, రాజు, కుమార్, రమేశ్, మహేశ్, ప్రేమ్‌కుమార్, నరేశ్, కృష్ణ, అంజి, వేణు, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు

యాచారం : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం సందర్భంగా మండలంలోని యాచారం, గున్‌గల్, నందివనపర్తి, మేడిపల్లి తదితర గ్రామాల్లో ఆ సంఘం కార్యకర్తలు ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రావుల బాబు పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసే దాకా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాదిగల ఆత్మగౌరవం కోసం వర్గీకరణ ఉద్యమం చేపట్టామన్నారు. నాయకులు మాజీసర్పంచ్ బోడ కృష్ణ, నాయకులు చింతుల్ల సాయిలు, ఎం.అనిల్‌కుమార్, ముత్యాలు, జంగయ్య, అశోక్, యాదయ్య, కృష్ణ తదితరులున్నారు.



యాచారం : మాల్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తున్న కార్యకర్తలు

చేవెళ్ల : 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమం స్థిరంగా నిలబడిందని ఎమ్మార్పీఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ఊరేనుక ప్రవీణ్‌కుమార్ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణకై ఉద్యమం నడుస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం ఎమ్మార్పీఎస్ పాటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్, షాబాద్, మండలాల అధ్యక్షులు ఇన్‌చార్జీలు మహేంద్రందర్ మాదిగ, మల్లికార్జున్ మాదిగ, మొయినాబాద్ గ్రామాధ్యక్షుడు తోట సంజయ్‌కుమార్ మాదిగ, చేవెళ్ల మండల సీనియర్ నాయకులు చేగురి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

శంషాబాద్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో ఎమార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మద్దిలేటి మాదిగ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రజల సమస్యలపై ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని పలువురు నేతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టేవరకూ ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కె.రమేష్, రత్నం, నర్సింహ, ఆర్‌బీ రాజు, జయసింహ, రాచమల్ల చిట్టిబాబు, ఆర్. రాజు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : జెండాను ఎగురవేసి నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్రైం కార్నర్

నాగర్ కర్నూల్ జిల్లాలో

షాద్‌నగర్ వాసి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, జూలై 7: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన దొడ్డి యాదగిరి(38) నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి గ్రామ శివారులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గురువారం ఇంటి నుంచి బంధువుల గ్రామమైన పోలిశెట్టిపల్లిలో ఉండే బావ ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు అక్కడి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈక్రమంలో ఆదివారం ఉదయం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

120 కిలోల నల్లబెల్లం స్వాధీనం

● కారు బోల్తా పడటంతో పట్టుబడిన వైనం.. డ్రైవర్ పరారీ

యాచారం, జూలై 7 : అక్రమంగా నల్లబెల్లం తరలిస్తుండగా.. పోలీసులను చూసి కంగారుగా కారు నడపడంతో బోల్తాపడింది. అయితే, ఆ కారులో 120 కిలోల నల్లబెల్లం లభ్యమైంది. ఈ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్‌లో ఆదివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. ఏపీ 39జెపీ 8342 నెంబర్ గల బ్రిజా కారు హైదరాబాద్ నుంచి వస్తుండగా.. మాల్‌లో పెట్రోలింగ్ పోలీసులను చూసి డ్రైవర్ అతివేగంగా ముందుకెళ్లాడు. దాంతో కారు బోల్తా పడింది. వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు వెళ్లి చూసేసరికి కారులో 120 కిలోల బెల్లం లభ్యమైంది. పోలీసులు బోల్తాపడిన కారును అతి కష్టం మీద యథాస్థితికి తీసుకొచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎక్సైజ్ దాడులు.. ఇద్దరిపై కేసు నమోదు

ఆమనగల్లు, జూలై 7: ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఆదివారం ఎక్సైజ్ శాఖ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. గుడుంబా రహిత తెలంగాణలో భాగంగా దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. మూడు టీంలుగా ఏర్పడి దాడులు నిర్వహించినట్లు వివరించారు. కడ్తాల మండలం రావిచెడ్ గ్రామ సమీపంలోని గుట్టల్లో 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తుల నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకొని రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ వివరించారు. ఒకరిని అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, నర్సింహ, బాబు, ఆమని, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

● రూ.12,830 నగదు.. ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, జూలై 7: ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులోని ఓ ఫీడ్ సెంటర్‌లో పేకాటాడుతున్న ఐదుగురిని ఆదివారం సాయంత్రం ఎస్‌వోటీ అదుపులోకి తీసుకుంది. ఈమేరకు వారి నుంచి రూ.12,830 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంనకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఫీడ్ సెంటర్‌లో పేకాటాడుతుండగా ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. వారిపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి

● ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మొక్కలు నాటుతున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జూలై 7: వనమహోత్సవ నిర్దేశిత లక్ష్యాల పూర్తికి ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించేందుకు ప్రజలంతా ముందుకు రావాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిలు పిలుపు నిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు తమ వంతు కృషి చేయాలని కోరారు. కడ్తాల, వెల్దండ మండలాల్లో ఆదివారం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి లు పర్యటించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశమయ్యారు. అభివృద్ధి పనులపై చర్చించారు. ఆమనగల్లు సమీపంలోని యెన్నం ఆసుపత్రిలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి నిర్వాహకుడు యెన్నం హరికాంత్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్‌లతో కలిసి మొక్కలు నాటారు. సిల్వర్ జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పలువురు బాధితులను మల్లు రవి, కసిరెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతీఒక్కరు గుర్తించి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. భావితరాల మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు మొక్కల పెంపకం బాధ్యతగా భావించాలన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో వన మహోత్సవంలో భాగంగా 10 లక్షల మొక్కల పెంపకానికి లక్ష్యంగా నిర్ణయించి ఇప్పటికే నర్సరీలలో మొక్కలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. ప్రజా పాలనలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. అసంపూర్తి పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు భృంగి ఆనంద్ కుమార్, సంజీవ్ కుమార్, భూపతి రెడ్డి, మెకానిక్‌బాబా, సురేందర్ రెడ్డి, రామకృష్ణ, మధుసూధన్ రెడ్డి, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 7: గత ప్రభుత్వం అనాలోచితంగా రద్దు చేసిన వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలని వీఆర్వో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి అసెంబ్లీలో ప్రస్తావించి వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. గ్రామ పరిపాలనకు క్షేత్రపాలకులుగా ఉన్న వీఆర్వో వ్యవస్థను కుట్రపూరితంగా గత ప్రభుత్వం రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చి వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. వీఆర్వో వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం సైతం గ్రామ పరిపాలనపై పట్టు కోల్పోతున్నదని తెలిపారు. వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించి, చిన్నాభిన్నమైన వీఆర్‌వోలను తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకురావాలని కోరారు. సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో జేఏసీ నాయకులు శ్రీహరి, రమేష్, మానయ్య, జగన్, షబ్బీర్, నరహరి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, బచ్చయ్య, సుధాకర్, రాంచంద్రయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ప్రజలకు సేవ చేయడం అదృష్టం

కేశంపేట, జూలై 7: ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలోని ఆయన నివాసంలో కేశంపేట మండలంలో ఇటీవల పదవీ బాధ్యతలు పూర్తి చేసుకున్న సర్పంచ్, ఎంపీటీసీలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి అనుసంధానంగా ప్రజలకు తమ వంతుగా సహాయం చేయడం ఒక ప్రజా ప్రతినిధులకు మాత్రమే సాధ్యపడుతుందని అన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే వారిని ప్రజలు గుర్తించి గెలిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ గండ్ర జగదీశ్వర్ గౌడ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్ రెడ్డి, నవీన్‌కుమార్, తోట ఆంజనేయులు, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, పోచమోని పార్వతమ్మ, జమాల్‌ఖాన్, మాజీ ఎంపీటీసీలు అనురాధ, మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, యాదయ్య చారి, సాజీద్, జగన్ రెడ్డి, గోగు వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్, ఎంపీటీసీలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మాడ్గుల ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజుగౌడ్



మాడ్గుల, జూలై 7 : మాడ్గుల ఇన్‌స్పెక్టర్‌గా నాగరాజుగౌడ్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మాడ్గులకు వచ్చారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన విష్ణువర్ధన్ రెడ్డి భువనగిరి ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. నాగరాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా కృషి చేస్తానని తెలిపారు.

ఆమనగల్లు ఎస్సైగా వెంకటేష్



ఆమనగల్లు, జూలై 7 : ఆమనగల్లు ఎస్సైగా బి.వెంకటేష్ ఆదివారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై శ్రీనివాసులు శంషాబాద్‌లోని ఆర్జీఐఏ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్సై బి.వెంకటేష్ సీఐ ప్రమోద్‌కుమార్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

కేశంపేట ఎస్సై కుప్పగిరి లింగం బదిలీ



సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్సై లింగం

కేశంపేట, జూలై 7: కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కుప్పగిరి లింగంను ఉన్నతాధికారులు శనివారం రాత్రి బదిలీ చేశారు. కేశంపేట నుంచి హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే శంషాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి టి.రాజ్‌కుమార్ కేశంపేట పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అయితే బదిలీపై వెళ్తున్న ఎస్సై కుప్పగిరి లింగం తోటి సిబ్బందిని సన్మానించారు. శివలింగం, శ్రీనివాస్, భీమ్‌రాజ్, శివకుమార్ తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

కడ్తాల్, జూలై 7: కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, వారి కుటుంబాలకు ఏ ఆపద వచ్చినా కుటుంబంలో ఒకరిగా అండగా నిలుస్తుందని ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిలు అన్నారు. రేఖ్య తండాలో ఆదివారం మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత సభావట్ కృష్ణానాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి బీక్యానాయక్‌లతో కలిసి కృష్ణానాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.



కృష్ణానాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్ రెడ్డి

'హేచరీస్' కార్మికులకు బీఆర్ఎస్, సీఐటీయూ మద్దతు

కేశంపేట, జూలై 7: వేతనాలు పెంచాలంటూ ఆందోళనకు దిగిన వెంకటేశ్వర హేచరీస్ కార్మికులకు కేశంపేట బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శివారులోని వెంకటేశ్వర హేచరీస్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వేతనాలు పెంచాలంటూ శనివారం ఆందోళనకు దిగారు. ఆదివారం రెండో రోజు దీక్షను కొనసాగిస్తున్న కార్మికులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికులు డిమాండ్లను బేషరుతుగా పరిష్కరించాలని కోరారు. అలాగే సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు నవీన్ కుమార్, మల్లేష్ యాదవ్, జగన్ రెడ్డి, జమాల్‌ఖాన్, సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ తదితరులున్నారు.



మద్దతు తెలపుతున్న నాయకులు

పదోన్నత పొందిన జీహెచ్‌ఎంలకు సన్మానం



షాద్‌నగర్ అర్బన్, జూలై 7: జీహెచ్ఎంలుగా పదోన్నతి పొందిన గణిత ఫోరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గణిత ఫోరం షాద్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన ఆదివారం షాద్‌నగర్‌లో సమావేశం జరిగింది. సమావేశంలో జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన శ్రీశైలం, దొంతు పాండురంగయ్య, బాబుచంద్, మల్లేషం, గణేష్‌కుమార్‌లను సన్మానించి, అభినందనలు తెలిపారు. నాయకులు బాలప్రసాద్, ప్రకాష్, వరదారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రమామహేశ్వర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.


'విద్యారంగంపై కాంగ్రెస్ నిర్లక్ష్యం'

కడ్తాల్, జూలై 7: కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యపై ఏ మాత్రం శ్రద్ధలేదని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్‌లు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 7నెలలైనా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం విచారకరమన్నారు. కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం జడ్పీటీసీ దశరథ్ నాయక్ నివాసంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో రూ.3.50 కోట్లతో కేజీబీవీ భవనం నిర్మించిన ప్రారంబించకుండా ఎమ్మెల్యే కసిరెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రెండు, మూడు రోజుల్లో భవనాన్ని ప్రారంభించకపోతే విద్యార్థినిల తల్లిదండ్రులు, స్థానికులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కడ్తాల్, జూలై 7: మండలంలో ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీ చంద్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన గొర్లకుంట తండాకు చెందిన రాజు నాయక్, అనారోగ్యంతో మృతిచెందిన కానుగు బావి తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నేనావత్ ధర్మ నాయక్, చరికొండ గ్రామానికి చెందిన పెద్ద జంగయ్య, చిందం గుండాలు ల కుటుంబాలను వంశీచంద్ పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎక్వాయిపల్లిలో నిర్వహించిన మాజీ ఎంపీపీ బుగ్గయ్యగౌడ్ తృతీయ వర్ధంతిలో పాల్గొని నివాళులర్పించారు.

పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలి



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న సాధ మల్లారెడ్డి

కందుకూరు, జూలై 7: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల విషయంపై శాసన సభలో చర్చించి, బిల్లుల మంజూరుకు కృషి చేయాలని కోరుతూ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి, బీజేపీ జిల్లా పంచాయతీ సెల్ మాజీ కన్వీనర్ సాధ మల్లారెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి తాజా మాజీ సర్పంచ్‌ల సమస్యలను క్లుప్తంగా వివరించి, పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. ఐదు సంవత్సరాల పాలనలో రెండు సంవత్సరాలు కరోనాతో, మూడు సంవత్సరాలు సాదారణ సమయంలో ప్రజలకు సేవలందించినట్లు గుర్తుచేశారు. గ్రామాలలో ప్రజలకు మౌళిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం పనులు చేపట్టినా.. నేటికీ పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయలేదన్నారు. ఒక్కొక్క సర్పంచ్‌కు లక్ష నుంచి రూ.25లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు మల్లారెడ్డి తెలిపారు.

కనకాల కట్ట మైసమ్మ బోనాలకు తరలివెళ్లిన కుమ్మరి సంఘం నేతలు

కందుకూరు, జూలై 7: నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ వద్ద గల కనకాల కట్ట మైసమ్మ అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించడానికి మండలంలోని గ్రామాల నుంచి కుమ్మరి సంఘం నేతలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు బి.రవి ఆధ్వర్యంలో ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య ఆ సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు శేరిగూడెం జయ్యమ్మలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.